క్లుప్తంగా

తెలంగాణ పండితులకు సత్కారం



పండితులకు వస్త్రాలు అందజేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం: విశాఖ శ్రీ శారదాపీఠంలోని రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో 15 రోజులుగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన వేద పండితులు నిర్వహించిన సంపూర్ణ కృష్ణ యజుర్వేద పారాయణ మంగళవారంతో ఘనంగా ముగిసింది. 14 మంది వేద పండితులు 15 రోజుల పాటు పారాయణ చేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ వేద పండితులను ఘనంగా సత్కరించారు. ఆశీస్సులు అందజేశారు.

కల్యాణం.. కమనీయం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు చక్రపాణి, ఆత్మకూరి రవి తదితరులు కల్యాణం జరిపారు.

సుబ్రహ్మణ్య స్వామి చెంత పూజలు



సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో వేంజేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

'ఉక్కు' పరిరక్షణకు దేశవ్యాప్త ఉద్యమాలకు సిద్ధం



712వ రోజు దీక్షశిబిరంలో మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలనే దుర్మార్గపు ఆలోచనను విరమించుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. లేకుంటే పోరాటాల ద్వారా కేంద్రానికి తగిన గుణపాఠం నేర్పుతామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 712వ రోజు మంగళవారం బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. దీక్ష శిబిరంలో ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, విళ్లా రామ్మోహనకుమార్, యు.రామస్వామి, ఎస్.రామారావు, సీహెచ్.సన్యాసిరావు ప్రసంగించారు. ప్రజల సంపదైన విశాఖ ఉక్కును కాపాడుకోవడం కోసం దేశ వ్యాప్త ఉద్యమాలకు సిద్ధమన్నారు. కొత్త ప్రభుత్వరంగ సంస్థలను ఏర్పాటు చేయలేని కేంద్ర ప్రభుత్వానికి ఉన్న పరిశ్రమను అమ్మే హక్కు లేదన్నారు. ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న ఉక్కు ప్రజాగర్జనలో కార్మికులు, నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంట్ నాయకులు ఆర్.వెంకటరావు, డి.శ్రీనివాస్, రవికుమార్, గుమ్మడి నరేంద్ర, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆడపిల్ల ఇంటికి ఆభరణం



సదస్సులో మాట్లాడుతున్న కమిషన్ సభ్యుడు గొండు సీతారాం



కార్యక్రమంలో పాల్గొన్న బాలికలు

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం



ఎస్పీ గౌతమి సాలి

సబ్బవరం: ఆడపిల్లలు ఇంటికి ఆభరణం వంటివారు.. వారిని భారంగా భావించవద్దు అని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని బాలికలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ దేశంలో లింగ వివక్ష,నిరక్షరాస్యత వంటి దీర్ఘకాలిక సమస్యలు దశాబ్దాలుగా వెంటాడుతూనే ఉన్నాయన్నారు. బాలికల హక్కుల ఉల్లంఘన, ఆడపిల్లలను విద్యకు దూరంగా నెట్టివేయడం,ఆడ పిల్లల్లో పోషకాహార లోపం, అనధికార విక్రయాలు వంటి పరిణామాలు జరుగుతుండడం విచారకరమన్నారు. వీటిని సమూలంగా రూపుమాపాలన్న లక్ష్యంతో ఆడ పిల్లలను ఆరోగ్యంగా ఎదగనిద్దాం, ఉన్నత విద్య అందిద్దాం,అబ్బాయిలతో సమానంగా విద్యా,ఉద్యోగ అవకాశాలు కల్పిద్దాం అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. దీనికోసం కోట్లాదిరూపాయిలు వెచ్చించి రాష్ట్ర ప్రభుత్వం ఆడ పిల్లలపై ఉండే అభిమానాన్ని,బాధ్యతను చాటుకుంటుందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా ఆడ పిల్లల హక్కులతో ముడిపడి ఉన్న అనేక అంశాలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, సబ్బవరం ఐసీడీఎస్,చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ వి. లలిత్ కుమారి,అసిస్టెంట్ సాంఘిక సంక్షేమ అధికారి సత్యవతి, తహసీల్దార్ బి. సత్యనారాయణ, ఎంపీడీవో రమేష్ నాయుడు, పోలీస్ అధికారులు, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులు,అంగన్‌వాడీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాలికలకు అపార అవకాశాలు

సబ్బవరం: బాలికలు ఏ విషయంలోనూ బాలుర కంటే తక్కువ కాదని .. ఆకాశమే హద్దుగా రాణించాలని అనకాపల్లి ఎస్పీ గౌతమి సాలి అన్నారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయంలోని సెంట్ ఫర్ చైల్డ్ అండ్ లా ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ ఎస్. సూర్యప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఉన్నత స్థితిలో ఉన్న స్త్రీలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. నేటి పరిస్థితుల్లో బాలికలు,స్త్రీలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలు,బాలికల రక్షణ కోసం దిశ చట్టం తీసుకువచ్చిందన్నారు. దిశ యాప్‌ను అందరూ డౌన్‌లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ పరిస్థితుల్లోనైనా అభద్రతగా అనిపించినపుడు దిశ యాప్‌లో ఫిర్యాదు చేస్తే అతితక్కువ సమయంలో పోలీసుల సహాయం పొందవచ్చన్నారు. విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానం ఇచ్చారు. వర్సిటీ కులపతి సూర్యప్రకాష్ మాట్లాడుతూ బాలికల రక్షణ మనందరి బాధ్యత కావాలని సూచించారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



పాత పెందుర్తి హైస్కూల్లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



పెందుర్తి గ్రంథాలయంలో మాట్లాడుతున్న సూర్యకళ తదితరులు

సింహాచలం: జాతీయ బాలికల దినోత్సవాన్ని మంగళవారం పాత పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు పెందుర్తి శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. బాలికల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేస్తున్న పలు పథకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూర్తి విద్యార్థినులకు వివరించారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వరకు ఎంతో మంది మహిళలు నిర్వహిస్తున్న బాధ్యతల గొప్పదనాన్ని వివరించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

పెందుర్తి గ్రంథాలయంలో...

పెందుర్తిశాఖా గ్రంథాలయంలో బాలికల అభ్యున్నతికి ప్రభుత్వం చేస్తున్న కృషిని గ్రంథాలయాధికారి బి.సూర్యకళ విద్యార్థినులకు తెలియజేశారు. బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను రూపుమాపేందుకు ప్రభుత్వం కఠినమైన దిశ, నిర్భయ చట్టాలు తీసుకువచ్చిందని వివరించారు.

వృద్ధురాలి అదృశ్యం



వెంకాయమ్మ

సింహాచలం: వృద్ధురాలి అదృశ్యంపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పురుషోత్తపురం దరి బాలాజీ స్కూల్ సమీపంలోని సుమధర అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సిర్రా వెంకాయమ్మ కొన్ని రోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆమెకు మతి స్థిమితం సరిగ్గా లేదు. గతంలో కూడా పలుమార్లు ఆమె ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయిన సంఘటనలు ఉన్నాయి. వెంకాయమ్మ కుటుంబ సభ్యురాలు శీర రత్నం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్రమత్తతతో తెగుళ్లకు చెక్



జీడి పంటకు సోకే తెగుళ్లపై సూచనలిస్తున్న వీహెచ్‌ఏ అనూష

పరవాడ: జీడి తోటలకు సోకే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని నాయుడుపాలెం ఆర్‌బీకే వీహెచ్‌ఏ అనుష సూచించారు. ఉద్యానశాఖ తోట బడి కార్యక్రమంలో భాగంగా జీడి తోటలకు సోకే తెగుళ్లు, నివారణ చర్యలపై మంగళవారం నాయుడుపాలెం శివారు గంగునాయుడుపాలెం, తమ్మయ్యపాలెం గ్రామాల రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. జీడి తోటలకు సోకే తెగుళ్లను ఉద్యాన శాఖ అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా నివారణ చర్యలు చేపట్టవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు కూండ్రపు కృష్ణంనాయుడు, బి.ఉమాదేవి, రైతులు పాల్గొన్నారు.

339 మందికి వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందజేస్తున్న జీజీఎం సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం సౌజన్యంతో హెల్పేజ్ ఇండియా సహకారంతో కలపాకలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, పారిశుధ్యం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పన కోసం సంస్థ నిత్యం కృషి చేస్తుందన్నారు. బొబ్బిలి, మూల స్వయంభూవరం, స్వయంభూవరం, కలపాక, గొల్లలపాలెం, మరిశవానిపాలెం గ్రామాల నుంచి వచ్చిన 339 మంది రోగులకు గైనకాలజీ, డెంటల్, డెర్మటాలజీ వైద్య నిపుణులు అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కలపాక సర్పంచ్ బొండా కనకారావు , దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజుసిన్హా, ఏజీఎం హెచ్‌ఆర్ రుమా డీశర్మ, సీఎంవో డాక్టర్ ఏకే దాస్మోహపాత్రో, హెచ్‌ఆర్ డీజీఎం అనిత్‌కుమార్, సీఎస్సార్ మేనేజర్ కె.ప్రకాశరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ పరీక్ష



పరీక్ష కేంద్రం బయట అభ్యర్థులు, వారి బంధువులు

సింహాచలం: జేఈఈ పరీక్ష మంగళవారం పెందుర్తిలో ప్రశాంతంగా జరిగింది. చినముషిడివాడలోని అయాన్, జియాన్ సెంటర్లలో విద్యార్థులు పరీక్ష రాశారు. అభ్యర్థులతో పాటు తల్లిదండ్రులు, బంధువులు రావడంతో ఆయా కేంద్రాల బయట రద్దీ నెలకుంది. జియాన్ కేంద్రం వద్ద కొంతమేర ట్రాఫిక్ సమస్య ఏర్పడింది.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న జోసెఫ్, దళిత సంఘాల నాయకులు

సింహాచలం: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని విశాఖ జిల్లా విజిలెన్స్ ఎస్సీ ఎస్టీ మోనటరింగ్ కమిటీ మెంబర్ బోనెల జోసెఫ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ గడువు పదేళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు స్వీట్లు తినిపించుకుని సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. జోసెఫ్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పదేళ్లు పెండం వల్ల అన్నిరంగాల్లో వారంతా అభివృద్ధి సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఏయూ మాజీ ప్రొఫెసర్ సుబ్బారాయుడు, విశాఖ జిల్లా మాజీ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ డుంబారి రామారావు, బుద్ధ జై భీమ్ అభివృద్ధి సేవా సంఘం వ్యవస్థాపకుడు గొల్ల ఈశ్వరరావు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

తెలుగు విభాగం సందర్శన



తెలుగు విభాగం వద్ద డాక్టర్ లక్ష్మీపార్వతి, ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగాన్ని మంగళవారం తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి సందర్శించారు. ఆమెతో పాటు రెక్టార్ ఆచార్య కె.మమత పీజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులతో మమేకమయ్యారు. తెలుగు భాషను పరిరక్షించాల్సిన బాధ్యత, సంస్కృతి సంప్రదాయాలను రక్షించవలసిన ఆవశ్యకతను లక్ష్మీపార్వతి వివరించారు. విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, ఈ వయస్సులో తప్పటడుగులు వేయటానికి ఎక్కువ అవకాశం ఉంటుందని, అందుకోసం మనస్సు సాహిత్యం వైపు మరల్చి చక్కగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్ర అప్పారావు, తెలుగు ఆచార్యులు డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, పెండ్యాల లావణ్య, ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి), బోధనేతర సిబ్బంది, పరిశోధక, స్నాతకోత్సవ విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ సిబ్బంది

సబ్బవరం: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బంది మంగళవారం కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ప్రాజెక్టు అధికారి లలిత్ కుమారికి సీఐటీయూ నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ, వీవీ రమణమ్మతో కలిసి అంగన్‌వాడీ సిబ్బంది తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని,ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు నిలిపివేయాలన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని, అవసరమైన గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి రమణి, ఉపాధ్యక్షురాలు సీహెచ్ దేవి, కార్యకర్తలు బి.రమణమ్మ,ఎస్. జగదేశ్వరి,పుష్పాదేవి,ఆర్. శివరామలక్ష్మి పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణల తొలగింపు

గోపాలపట్నం: గోపాలపట్నం బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలో ఫుట్ పాత్ ఆక్రమణలపై ట్రాఫిక్ పోలీసులు, సచివాలయ కార్యదర్శులు మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గోపాలపట్నం రైల్వే స్టేషన్ రోడ్డు నుంచి ఎల్బీ పాలిమర్స్ జంక్షన్ వరకు ఈ డ్రైవ్ చేపట్టారు. రోడ్డుపై, ఫుట్ పాత్‌లపై ఏర్పాటు చేసిన దుకాణాలు, తోపుడు బళ్లను తొలగించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో దుకాణాలు ఇబ్బందిగా తయారవుతున్నాయని తెలిపారు. సీఐ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 91, 92 టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు దామోదర్, పాత్రుడు, బాలాజీ, రాజేష్, ఆదిత్య, ఈశ్వర్, సత్యనారాయణ, సుశీల, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతీ ఇంటా సంక్షేమం

ఎమ్మెల్యే అదీప్‌రాజ్



లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: నవరత్నాలతో ప్రతీ ఇంట సంక్షేమ ఫలాలు చేరువవుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. 79వ వార్డు లంకెలపాలెం వార్డు సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒకప్పుడు ప్రభుత్వ పథకాలతోపాటు ఏ ధృవీకరణ పత్రం కావాలన్నా సుదూర ప్రాంతంలోని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదని, నేడు సచివాలయ, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజల ముంగిటకే వస్తున్నాయని చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను గెలిపించుకోడానికి ప్రజలు సన్నద్ధులై ఉన్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం వల్ల అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. స్థానికులు రోడ్డు, డ్రై నేజీ సమస్య పరిష్కరించాలని, వీధి దీపాలు వెలిగించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అన్నంరెడ్డి అజయ్‌రాజ్, వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, జి.పూర్ణానందశర్మ, సుందరపు అప్పారావు కింతాడ ఈశ్వరరావు, కర్రి నరసింగరావు, యలమర్తి వెంకటరావు, కాతా నూకేష్, నెల్లి కన్నబాబు, కరణం కోటేశ్వరరావు, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అశ్రద్ధ వద్దు

- విద్యార్థులకు అవగాహన సదస్సు



విద్యార్థులకు కంటి సమస్యలపై అవగాహన కల్పిస్తున్న మణిమాల

సింహాచలం: కంటి సమస్యలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ అండ్ గ్రూప్ సీఈవో కేబీఎన్ మణిమాల సూచించారు. ఎన్ఏడీ కొత్తరోడ్డులోని భాష్యం స్కూల్, గోపాలపట్నంలోని ఆళ్వార్‌దాస్ కళాశాల విద్యార్థులకు శంకర్ ఫౌండేషన్‌లో మంగళవారం కంటి సమస్యలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంద్రియాల్లో అధిక ప్రాధాన్యం కంటికి ఉందన్నారు. ప్రపంచాన్ని మనకు చూపించేది కన్ను మాత్రమే అని తెలియజేశారు. కళ్లు లేకపోతే జీవితమంతా అంధకారమే అన్నారు. నేటి విద్యార్థులు కంప్యూటర్స్, స్మార్ట్ ఫోన్స్ వినియోగంలోనే ఎక్కువ సమయం గడపడంతో దృష్టి సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తప్పనిసరిగా కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ఆదిలోనే దృష్టి సమస్యలను గుర్తిస్తే చిన్నపాటి వైద్యంతోనే నయం చేసుకోవచ్చన్నారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ సుపర్ణ, డాక్టర్ సౌమ్య కంటి వైద్యంలో వినియోగిస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని, శస్త్ర చికిత్సల్లో వినియోగిస్తున్న నూతన పద్ధతులను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వి.రమేష్‌కుమార్, సీనియర్ మేనేజర్లు కె.ఎస్.వినోద్, సుభాషిణి, శ్రీధర్ పాల్గొన్నారు. అంతకముందు కంటి ఆరోగ్యంపై గోపాలపట్నం నుంచి నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్‌కు ఆళ్వార్‌దాస్ కళాశాల విద్యార్థులు ర్యాలీగా తరలివచ్చారు.

అన్నప్రసాదంలో పురుగు



అన్నప్రసాదంలో వచ్చిన పురుగు

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలోని అన్నప్రసాద భవనంలో మంగళవారం భక్తుడు అన్నప్రసాదం స్వీకరిస్తుండగా పురుగు కనిపించడంతో కంగుతిన్నాడు. ఈ విషయంపై అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని అడిగినా ఎవరూ పట్టించుకోలేదని వాపోయాడు. వివరాలు...నగరంలోని సీతంపేట ప్రాంతానికి చెందిన రమణమూర్తి అనే భక్తుడు కుటుంబసమేతంగా మంగళవారం స్వామివారి దర్శనానికి వచ్చాడు. దర్శనానంతరం అన్నప్రసాద భవనంలో మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అన్నప్రసాదం స్వీకరిస్తుండగా పురుగు కనిపించింది. ఈ విషయంపై వడ్డన చేస్తున్న వారిని, అక్కడ ఉన్న సిబ్బందిని అడగ్గా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో విషయాన్ని మీడియా దృష్టికి తీసుకెళ్లాడు. అక్కడ సిబ్బందిని ప్రశ్నించినా ఎవరూ బాధ్యతగా వ్యవహరించలేదని ఆరోపించారు. ఈ విషయంపై అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ నరసింగరావును వివరణ కోరగా అన్నప్రసాద విభాగంలో పరిశుభ్రతతో పదార్థాలు సిద్ధం చేస్తామని తెలిపారు. అన్నప్రసాద భవనంలో అందుబాటులోనే ఉన్నానని, పురుగు వచ్చిన విషయాన్ని సదరు భక్తుడు తన దృష్టికి తీసుకురాలేదని చెప్పారు. ఈ విషయంపై లిఖితపూర్వకంగా కూడా ఫిర్యాదు చేయలేదన్నారు. మరింత శ్రద్ధతో అన్నప్రసాదాలు తయారు చేస్తామన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్, విద్యార్థులు

సింహాచలం: రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెందుర్తి ట్రాఫిక్ విభాగం ఎస్ఐ రమేష్ పిలుపునిచ్చారు. పెందుర్తి శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులతో కలిసి ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ట్రాఫిక్ నిబంధలపై పెందుర్తి జంక్షన్ వరకు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సురక్షిత ప్రయాణానికి ట్రాఫిక్ రూల్స్ పాటించాలంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా సురక్షితమైన ప్రయాణం సాగించవచ్చన్నారు. చిన్నపొరపాటు ఎంతో అనర్థాన్ని తెచ్చిపెడుతుందన్నారు. ఇంట్లో చీకటి నింపుతుందని తెలియజేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్టు ధరించాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం సేవించి డ్రైవ్ చేయడం, సిగ్నల్ క్రాసింగ్, ఓవర్‌స్పీడ్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్రజలంతా ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఉప సర్పంచ్ లక్ష్మణ

సబ్బవరం: సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెంలో సీతారాముల తీర్థం సందర్భంగా మంగళవారం నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలను సబ్బవరం మేజర్ పంచా యతీ ఉపసర్పంచ్ మండల లక్ష్మణ ప్రారంభించారు. పోటీ ల్లో 14 జట్లు పాల్గొన్నాయి. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లుకు వరుసగా రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొటాన రాము, బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి,ఎంపీటీసీ బైలపూడి దేముడు బాబు, గొంప దేముడు, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

29న టాలెంట్ టెస్ట్

బీచ్ రోడ్డు: సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఈ నెల 29న టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్టు తక్షశిల ఐఏఎస్ అకాడమీ నిర్వాహకులు జి.సాయిరాం తెలిపారు. మంగళవారం టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఏడాది 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. పూర్తి వివరాల కోసం 99652 52252 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.